# ఆధ్యాత్మిక కథలు

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | భగవన్నామం | ..... | 1 |
| 2. | దాన గ్రహీతలు లేరు! | ..... | 6 |
| 3. | వ్యాసుని కాశీ విజయం | ..... | 9 |
| 4. | కృష్ణుడు – కర్ణుడు | ..... | 16 |
| 5. | అహం అనర్థ హేతువు | ..... | 20 |
| 6. | ధర్మదత్తుడు చేసిన దానం | ..... | 28 |
| 7. | కృష్ణుడు ఇచ్చిన వివరణ | ..... | 35 |
| 8. | మహోన్నత దానశీలి | ..... | 39 |
| 9. | రైతు : జ్యోతిష్కుడు | ..... | 43 |
| 10. | అసత్యం పలుకవచ్చా? | ..... | 47 |
| 11. | సుతీక్ష్ణ మునివర్యులు | ..... | 53 |
| 12. | ఆశ్రయ దోషం | ..... | 56 |
| 13. | రాయి తేలింది! | ..... | 59 |
| 14. | నమ్ముకుని వచ్చిన వారిని వదలివెయ్యరాదు | ..... | 62 |
| 15. | ఒక బౌద్ధ మహిళ కథ | ..... | 65 |
| 16. | ఇది కదా సహనం! | ..... | 71 |
| 17. | గురుభక్తి | ..... | 75 |
| 18. | పాపంతో కూడబెట్టిన ధనం | ..... | 78 |
| 19. | విధి అనుల్లంఘనీయం | ..... | 82 |
| 20. | దేవి కారుణ్యం | ..... | 90 |
| 21. | చిన్న సంఘటన గొప్ప గుణపాఠం | ..... | 96 |
| 22. | సప్తర్షుల కఠోర నిష్ఠ | ..... | 99 |

# 1. భగవన్నామం

పూర్వం ఒకప్పుడు ఒక గ్రామంలో ఒక బ్రాహ్మణుడు భార్యతో జీవిస్తూ ఉండేవాడు. అతడు పేదవాడు. తన స్వల్ప ఆదాయంతో గుట్టుగా, సంతృప్తిగా జీవయాత్ర చేస్తున్నాడు. తనకన్నా పేదలైన వారికి తన శక్తి మేరకు సహాయం చేస్తుండే వాడు; సాధువులకు సేవలు చేసేవాడు. అతడిలో స్వార్థం కాని, పేరాసకాని జాడమాత్రంగా కూడా లేదంటే అతిశయోక్తి కాదు.

కాని బ్రాహ్మణుని భార్య స్వభావం భర్తకు పూర్తి వ్యతిరేకం. ఉన్న దాంతో సంతృప్తిగా జీవించాలని ఆమెకు ఏ కోశానా లేదు. ఇంకా ఇంకా ధనం సంపాదించి కూడబెట్టాలి. సౌకర్యాలను బాగా పెంచుకొని సుఖసౌఖ్యాలతో జీవించాలని ఆమె కలలు కంటూ ఉండేది. తన ఇచ్ఛ మేరకు ఆడంబరంగా ఖర్చు చేయడానికి కావలసినంత ధనం లేని పరిస్థితిలో, భర్తను పుష్కలంగా సంపాదించమని ఆమె నిత్యం వేధిస్తూ ఉండేది.

అప్పుడు భర్త ఆమెతో, “మన నిరాడంబర జీవయాత్రకు అవసరమైనంత ధనం భగవంతుడు మనకు ఇచ్చాడు. ఇంతకంటే ఆశపడబోకు” అంటూ సర్ది చెబుతుండే వాడు. కాని ఆమె ఈ మాటలు అసలు పట్టించుకోకుండా, తను చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెబుతూండేది. ఆమె ఈ వేధింపులు బ్రాహ్మణునికి నరక బాధలను గుర్తు తెచ్చేది.

# ౨. దాన గ్రహీతలు లేరు!

పేదసాదల పట్ల ధర్మరాజుకు దయ, కరుణలు అపారం. అర్హులైన వారికి ఆయన విరివిగా దానధర్మాలు చేస్తూ ఉండేవాడు.

ఇలా ఉండగా ఒకసారి ధర్మరాజులో తన దాతృత్వం పట్ల, తన దయా స్వభావం పట్ల కించిత్తు గర్వం పొడసూపింది. ధర్మరాజు మనస్సులో గర్వం జాడ మాత్రంగా కానరావడం శ్రీకృష్ణుడు గమనించాడు. వెంటనే ధర్మరాజుకు ఒక గుణపాఠం నేర్పి ఆతడిలో అప్పుడప్పుడే మొలకెత్తుతున్న గర్వాన్ని అడుగంటా తొలగించాలని శ్రీకృష్ణుడు నిశ్చయించాడు.

మామూలుగా ఇద్దరు ఎక్కడకో పోతున్నట్లు ధర్మరాజును తోడ్కొని శ్రీకృష్ణుడు ఒక రోజు బయలుదేరాడు. ఆ సమయంలో పాతాళ లోకాన్ని మహాబలి పరిపాలిస్తున్నాడు. సాటిలేని రీతిలో మహాబలి దానధర్మాలు చేయడం ఆయనలోని విశేష గుణం. ఆయన దాతృత్వం లోక విదితం.

శ్రీకృష్ణుడు ధర్మరాజును పాతాళలోకానికి తోడ్కొని వచ్చాడు. ఇద్దరూ పాతాళలోక ముఖ్యపట్టణంలోని అనేక వీధుల గుండా మెల్లగా నడిచి వెళ్ళసాగారు.

ఇంతలో ధర్మరాజుకు దాహం వేసింది. కాబట్టి శ్రీకృష్ణుడు ధర్మరాజు ఎదురుగా ఉన్న ఒక ఇంటికి వెళ్ళారు. ధర్మరాజు తాగడానికి నీళ్ళు ఇవ్వమని ఆ ఇంట్లో అడిగాడు. ఆ ఇంటి గృహిణి ఒక బంగారు

# 3. వ్యాసుని కాశీ విజయం

కాశీ క్షేత్రంలో పరమశివుడు, 'విశ్వనాథుడు' అనే పేర వెలసి ఉన్నాడు; జగన్మాత అక్కడ 'అన్నపూర్ణాదేవి'గా కొలువై విరాజిల్లుతోంది.

కాశీక్షేత్ర యజమానిగా విశ్వనాథుడూ, యజమానురాలిగా అన్నపూర్ణాదేవి భాసిస్తూ ఉండడం వలన అక్కడి జనులు సదా సిరిసంపదలతో తులతూగుతూ ప్రశాంతంగా జీవయాత్ర చేస్తుండేవారు.

కాశీ ప్రజలు తాము సిరిసంపదలతో తులతూగుతూ ఉండడమే కాక, విరివిగా దానధర్మాలు చేసి సంతోషించే మనస్తత్వం గలవారు కూడా. కాబట్టే కాశీ తీర్థయాత్రకు వెళ్ళేవారు కడుపారా భుజించడంతో పాటు, కానుకలు పుచ్చుకుని ఆనందంతో తిరిగి రావడం ఆనవాయితీగా మారిపోయింది. దాంతో కాశీక్షేత్ర ఖ్యాతి భారతదేశం యావత్తు వ్యాపించింది.

వేదాలను నాలుగుగా వర్గీకరించీ, మహాభారతం, పురాణాలు రచించీ మానవాళికి మహోపకారం చేసిన వ్యక్తి వ్యాస భగవానుడు.

"కాశీ క్షేత్రంలో ఆకలితో అలమటించేవారు మచ్చుకికూడా లేరు. సంపన్నులు అక్కడ సదా విరివిగా దానధర్మాలు చేస్తూనే ఉంటారు" అంటూ జనులు కాశీక్షేత్రాన్ని గొప్పగా కీర్తిస్తూ మాట్లాడుకోవడం వ్యాసభగవానుని చెవిలో కూడా పడింది.

# 4. కృష్ణుడు - కర్ణుడు

మహాభారత యుద్ధంలో పదిహేడవ రోజు యుద్ధం ముగిసింది. మహారథుడైన కర్ణుడు రణరంగంలో నేలకొరిగిపోయాడు. కర్ణుని మరణాన్ని పురస్కరించుకొని పాండవ శిబిరాల్లో విజయోత్సవం జరుపుకొంటున్నారు. ఇంతటి సమధికోత్సాహ సమయంలో పాండవుల విజయానికి మూలకారణంగా వ్యవహరించిన కృష్ణుడు మాత్రం దిగులుతో కూర్చుని ఉన్నాడు. ఆయన మధ్యమధ్యలో, "నేడు ఈ ధరాతలం నుండి మహోన్నతుడైన దానశీలి నిష్క్రమించాడు" అంటూ గొణుగుతున్నాడు.

ధర్మానికే మరో పేరు అయిన యుధిష్ఠిరునికి ఎవరిని ప్రశంసించినా, ఎవరిలోని సద్గుణాలను ఎంతగా ప్రశంసించినా జాడమాత్రంగా కూడా ఈర్ష్య కలుగదు. కాని అర్జునునికి ఆగర్భ శత్రువైన కర్ణుని, కృష్ణుడు ఇలా ప్రశంసించడం విని మనస్సు చివుక్కుమనగా ధర్మరాజు తల వంచుకుని కిమ్మనకుండా కూర్చున్నాడు.

అప్పుడు అర్జునుని పరిస్థితిని చూసి కృష్ణుడు అతడితో ఇలా చెప్పాడు: "అర్జునా! నిన్ను చూస్తే, నేను కర్ణుని ఉత్తపుణ్యానికే పొగడుతున్నానని నువ్వు అనుకుంటున్నట్లుంది. ఒక పని చెయ్యి. నువ్వు ఇప్పుడు నాతో రా! కాస్త దూరంలో నిలబడి జరుగుతున్న దానిని గమనించు. దానశీలి అయిన కర్ణుడు ఇంకా కొన ఊపిరితో ఉన్నాడు. ఆ స్థితిలో కూడా అతడి దాతృత్వాన్ని చూద్దాం" అన్నాడు.

# 5. అహం అనర్థ హేతువు

ఒకప్పుడు పాశుపతాస్త్రం పొందగోరి అర్జునుడు, పరమశివుణ్ణి గూర్చి తపస్సు చేయాలని నిశ్చయించుకున్నాడు. అందునిమిత్తం ఒంటరిగా రథంలో బయలుదేరిన అతడు అరణ్యం మార్గంలో అనేక మృగాలను వేటాడుతూ ఒక పగటి వేళ రామేశ్వరం చేరుకున్నాడు.

అక్కడ అతడు సముద్రస్నానం చేసి మాధ్యాహ్నికం నిర్వర్తించాడు. ఆ తరువాత గర్వంతో రథాన్ని సముద్ర తీరంలో అటూ ఇటూ సమధికోత్సాహంతో వేగంగా నడిపించాడు.

అప్పుడు అక్కడ అరణ్యంలోని కొండ మీద శ్రీరామభక్త హనుమాన్ తపస్సు చేసుకొంటున్నాడు. 'రామ రామ' అంటూ జపంలో లయించిపోయి ఉన్న ఆంజనేయుని యాదృచ్ఛికంగా అర్జునుడు అక్కడ చూశాడు.

ఆయనను చూసి గర్వంతో అర్జునుడు, "ఏయ్ ముసలి కోతీ! నువ్వు ఎవరు? నీ పేరేమిటి?" అని గద్దిస్తూ అడిగాడు.

అందుకు ఆంజనేయుడు నవ్వుతూ ప్రశాంతంగా, "శ్రీరాముడు బండరాళ్ళతో సేతువు నిర్మించి, లంకకు వెళ్ళి రావణుణ్ణి సంహరించాడు. అంతటి కీర్తిమంతుడైన శ్రీరామునికి దాసుణ్ణి నేను. నన్ను హనుమంతుడనీ, వాయుపుత్రుడనీ పేర్కొంటారు" అని చెప్పాడు.

ఆంజనేయుడు, శ్రీరాముని ఆ విధంగా ప్రశంసిస్తూ చెప్పడం విన్న అర్జునునికి నవ్వాగలేదు. అతడు పరిహాసంగా, "ఓ వానరమా! నీ

# 6. ధర్మదత్తుడు చేసిన దానం

రామాయణంలో ప్రసిద్ధి గాంచిన కైకేయి పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలియజేసే కథ ఇది.

* * *

ఒకానొక కాలంలో సహ్యాచలం అనే పర్వతపు దిగువ ప్రాంతంలో కరవీరపురం అనే ఊరు ఉండేది. ఆ ఊళ్ళో ధర్మదత్తుడనే ఉత్తముడైన బ్రాహ్మణుడు జీవిస్తూ ఉండేవాడు. ఆయన ఒకసారి తన అలవాటు ప్రకారం కార్తీకమాసంలో ఏకాదశి వ్రతం ఆచరించాడు. ఆ రాత్రి భగవంతుని ఆరాధిస్తూ జాగారం చేసి, రాత్రి చివరి జాములో పూజకు కావలసిన సామగ్రిని సేకరించుకుని ఆలయానికి వెళుతున్నాడు.

మధ్య దారిలో భీకరంగా ఘోషిస్తూ ఒక రాక్షసి అమిత వేగంగా పరుగెత్తి రావడం ఆయన కంటపడింది. పాపం! ఉపవాసంతో నీరసించిన ధర్మదత్తుని శరీరం భయంతో వణకసాగింది. ఆయన నోరు భగవన్నామాన్ని ఉచ్చరించ నారంభించింది. తన మీదకు రాక్షసి ఇక ఉరకబోతున్నదని గ్రహించగానే, ధర్మదత్తుడు తన చేతుల్లో ఉన్న పూజా వస్తువుల పళ్ళెరాన్ని ఆమెపై విసిరి వేశాడు.

గొప్ప భక్తుడూ, ఏకాదశి వ్రతం తు.చ.తప్పక పాటించిన వాడూ అయిన ధర్మదత్తుడు స్వయంగా సేకరించిన తులసిదళాలు, తీర్థమూ మొదలైనవి ఆ రాక్షసి మీద పడగానే ఆమె గతకర్మల ఫలాలు

# 7. కృష్ణుడు ఇచ్చిన వివరణ

## రాధ హృదయం

ఒకసారి శ్రీకృష్ణుడు తన పరివారంతో సిద్ధాశ్రమ తీర్థంలో స్నానాలు ఆచరించడానికి వెళ్ళాడు. కాకతాళీయంగా రాధ తన నేస్తాలతో అక్కడకు రావడం తటస్థించింది. రెండు వైపుల వారు ఆకస్మికంగా ఆ పుణ్యతీర్థంలో అలా కలుసుకున్నందుకు ఎంతో సంతోషించారు; పరస్పరం ముచ్చట్లు చెప్పుకుని, సంభాషించి ఆనందించారు.

రాధ ఘనతను స్వయంగా కృష్ణుని ముఖతా ఆయన రాణులు విని ఉన్నారు. కాబట్టి వారు అదను చూసి రాధను ఒక ఏకాంత ప్రదేశంలో కలుసుకున్నారు. రాధ కూడా ఆప్యాయంగా వారిని ఆహ్వానించి, ఉపచర్యలు చేసింది. మాటల సందర్భంలో ఆమె, "సోదరీమణులారా! చంద్రుడు ఒక్కడే ఉన్నాడు; కాని చకోరాలు అనేకం" అనే అర్థం వచ్చే శ్లోకం చెప్పింది.

**చంద్రో యథైకో బహవ శ్చకోరాః**
**సూర్యో యథైకో బహుదోదృశస్యః ।**
**శ్రీకృష్ణచంద్రో భగవాం స్తథైవ**
**భక్తా భగిన్యో భహవో వయం చ ॥**

"శ్రీకృష్ణ పరమాత్మ ఒక్కరే; సోదరీమణులమైన మనం అందరమూ ఆయన భక్తురాండ్రం" అన్నది రాధ.

# 8. మహోన్నత దానశీలి

పూర్వం ఒకప్పుడు ఒక రాజ్యంలో ప్రసిద్ధికెక్కిన ఒక జూదరి ఉండేవాడు. జూదాన్నే వృత్తిగా చేసుకున్న అతడు దేవతలను బ్రాహ్మణులను సదా నిందిస్తూ ఉండేవాడు. లోకంలోని చెడు వ్యసనాలన్నిటికీ అతడు ఆలవాలమై విరాజిల్లాడు.

ఇలా ఉండగా ఒక రోజు జూదంలో చాలా ధనం గెలుచుకున్నాడు. దాంతో అతడి మనస్సు సంతోషంతో పొంగిపోగా, అతడే తన చేతులతో కిళ్ళీ కట్టి, చందనమూ, పువ్వుల మాలలు వంటివి తీసుకుని ఒక వెలయాలి ఇంటి వైపు వేగంగా అడుగులు వేస్తూ పోతున్నాడు.

దారిలో కాళ్ళు తడబడడంతో కిందపడి స్పృహ కోల్పోయాడు. కాసేపటికి స్పృహ వచ్చాక అతడు తన హృదయంలో ఏదో మార్పు కలగడం గ్రహించాడు. తను అంతదాకా గడిపిన చెడు జీవితం గురించిన దిగులు అతణ్ణి పట్టుకొంది. తత్ఫలితంగా అతడిలో వైరాగ్య బీజాలు అంకురించాయి. పిదప మనస్సులో స్పష్టత జనించగా నిర్మలమైన మనస్సుతో తన చేతిలో ఉన్న వస్తువులను సమీపంలో వెలసి ఉన్న ఒక శివలింగానికి అర్పించి ఇంటి ముఖం పట్టాడు.

కాలం తన వేగగతిలో వెళ్ళిపోతోంది. జూదరి జీవిత పయనం అంతమయింది. యమదూతలు అతణ్ణి యమలోకానికి తీసుకుపోయారు.

# 9. రైతు : జ్యోతిష్కుడు

సత్కర్మలు శుభకరమైన ఫలాలను ఒనగూర్చుతాయి అనడంలో ఎటువంటి సంశయమూ లేదు. అంతేకాదు సత్ చింతనలు సైతం సత్ఫలాలను ఒనగూర్చే శక్తిని సంతరించుకొని ఉంటాయి. ఈ రైతు కథ చదువుతున్నప్పుడు అరవై ముగ్గురు నాయన్మారులలో ఒకరైన పూసలార్ నయనార్ గుర్తుకు వస్తారు. మన పూర్వీకులు మానసికపూజను మనకు నొక్కివక్కాణించి చెప్పిన కారణం కూడా ఈ కథ మూలంగా తెలియవస్తుంది.

* * *

అదొక చిన్న ఊరు. ఆ ఊళ్ళో సుప్రసిద్ధుడైన ఒక జ్యోతిష్కుడు నివసిస్తున్నాడు. జాతకం నిశితంగా పరిశీలించి, గణించి చూసి ఆయన చెప్పిన ఫలితం ఎన్నడూ తప్పు అయినట్లు ఎవరూ కనీవినీ ఎరుగరు. ఆయన అంతటి ఘనత వహించిన జ్యోతిష్కుడు.

ఇలా ఉండగా ఒక రోజు సాయంత్రం ఆయన వద్దకు తన జాతకాన్ని చూపించుకోవడానికి ఒక పేద రైతు వచ్చాడు. ఆ రైతు తనను పరిచయం చేసుకొని తన జాతకాన్ని జ్యోతిష్కునికి ఇచ్చాడు.

ఆ జాతకాన్ని క్షుణ్ణంగా గణించి చూసిన ఆ జ్యోతిష్కుడు కంగారుపడ్డాడు. ఆ కంగారుకు కారణం, ఆ రైతుకు ఆ రాత్రి ఎనిమిది గంటలకు ప్రాణాంతకమైన ఒక గొప్ప గండం ఉండడమే! ఆ జ్యోతిష్కుడు

# 10. అసత్యం పలుకవచ్చా?

బుద్ధుడు బౌద్ధ సన్న్యాసుల నిమిత్తం ఒక సంఘారామం ఏర్పరిచాడు. దాన్లో స్వయంగా బుద్ధుని ఏకైక కుమారుడైన రాహులుడు కూడా చేరి సన్న్యాసం పుచ్చుకున్నాడు.

రాహులుడు సత్యం పలుకడం నుండి అప్పుడప్పుడు వైదొలగడం బుద్ధుడు గమనించకపోలేదు. కాబట్టి తన కుమారునిలో పరివర్తన తీసుకురావాలనే ఉద్దేశంతో ఒక రోజు, "ఓ యువ భిక్షూ! నిన్ను నేను ఒక చోటికి పంపబోతున్నాను. అక్కడకు వెళ్ళి నువ్వు ఇంద్రియనిగ్రహమూ, తపస్సు అభ్యసించి రా!" అని చెప్పాడు. తరువాత చాలా దూరంలో ఉన్న ఒక బౌద్ధ విహారానికి రాహులుని పంపించాడు.

బుద్ధుని ఆదేశం మేరకు ఆయన సూచించిన విహారంలో రాహులుడు జీవించసాగాడు. కొద్దికాలం గడిచింది. రాహులుడు నివసిస్తున్న విహారానికి బుద్ధుడు వెళ్ళాడు.

బుద్ధుని రాక రాహులునికి అమితానందభరితమైంది. అయినప్పటికీ అతడి హృదయంలో బెరుకు చోటుచేసుకొంది.

ఒక రోజు బుద్ధుడు, రాహులుణ్ణి తన వద్దకు పిలిపించి, "రాహులా! ఇప్పుడు నువ్వు నా పాదాలను కడగాలి" అని తెలియజేశాడు.

రాహులుడు తండ్రి పాదాలను ఒక పళ్ళెరంలో ఉంచి పద్ధతి ప్రకారం కడిగాడు. తరువాత బుద్ధుడు అతడితో, "రాహులా! నువ్వు నా పాదాలను కడగడానికి ఉపయోగించిన నీరు తాగడానికి తగినదా?" అని ప్రశ్నించాడు.

# 11. సుతీక్ష్ణ మునివర్యులు

“నా ఎదుట నిలబడక పో! నా నారాయణుని తీసుకువస్తేనే ఇక్కడకు రా!” అని అగస్త్యముని కోపావేశంలో అన్నాడు.

ఆయన చెప్పింది వినగానే బాలుడైన సుతీక్ష్ణుడు తల్లడిల్లిపోయాడు. కళ్ళ వెంట దుఃఖంతో అశ్రువులు స్రవిస్తూండగా ఆ బాలుడు గురువుగారికి సాష్టాంగ ప్రణామం చేసి భారంగా అడుగులు బైటకువేశాడు.

అతడి కాళ్ళు తడబడ్డాయి. కాని గుండెలో దిటవు, పట్టుదల జనించాయి. ‘అవును, గురుదేవుల ఆదేశం ప్రకారం ఎన్ని ఏళ్ళు పట్టినా సరే, ఈ ప్రాణం ఈ దేహంలో ఉంటే శ్రీమన్నారాయణునితోనే తిరిగి వస్తాను’ అని దృఢంగా సంకల్పించుకొన్నాడు.

సుతీక్ష్ణుడు పేరుకు తగ్గట్టు కుశాగ్రబుద్ధి. గురువుకు కూడా అతడంటే వల్లమాలిన అభిమానం. కాని అతడి దుందుడుకుతనం ఇంత అని చెప్పలేం. కొద్ది రోజుల క్రితం అగస్త్యుడు తీర్థాటనం చెయ్యడానికి బయలుదేరుతుండగా తన పూజాద్రవ్యాలు పదిలపరిచే పెట్టెతో పాటు విశిష్టమైన సాలగ్రామాన్ని సుతీక్ష్ణునికి అప్పగించి, “ఇదుగో, పూజా పేటికను, స్వామిని పదిలంగా ఉంచు. స్వామికి శ్రద్ధతో పూజ చెయ్యి” అని చెప్పి వెళ్ళడం సుతీక్ష్ణుడి చెవి కెక్కలేదు.

ఒక రోజు అతడు ఏటి నుండి జలం తెచ్చి సాలగ్రామానికి అభిషేకం చేశాడు. కాని మర్నాడు అతణ్ణి బద్ధకం ఆవహించింది. దాంతో

# 12. ఆశ్రయ దోషం

మహాభారత యుద్ధం ఒక రకంగా ముగిసింది. ధర్మరాజు చక్రవర్తిగా పట్టాభిషిక్తుడయ్యాడు.

భీష్ముడు ప్రాణాలు విడువడానికి ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూస్తూ యుద్ధభూమిలో అంపశయ్య మీద పడుకొని ఉన్నాడు.

ఇలా ఉండగా ఒక రోజు ధర్మరాజు, శ్రీకృష్ణుని అనుజ్ఞతో తన తమ్ములతోనూ, ద్రౌపదితోనూ భీష్మపితామహుణ్ణి చూడడానికి కురుక్షేత్రానికి వెళ్ళాడు.

పాండవులు, ద్రౌపది పరమ ధర్మాత్ముడైన భీష్మునికి పాదాభివందనాలు చేశారు. తరువాత ధర్మరాజు ఆయనను వర్ణాశ్రమాలు, పౌరుల కర్తవ్యాలు, రాజు విధులు వంటి ముఖ్యమైన విషయాల గురించిన అనేక ప్రశ్నలు అడిగాడు. భీష్ముడు ఆ ప్రశ్నలన్నింటికీ సముచిత జవాబులు ఇవ్వసాగాడు.

ఈ విధంగా భీష్ముడు, ధర్మజునికి ధర్మోపదేశం చేస్తూన్నప్పుడు హఠాత్తుగా ద్రౌపది ఫక్కున నవ్వింది.

ఆ నవ్వు శబ్దం విన్న భీష్ముడు ధర్మోపదేశాన్ని సగంలో ఆపివేసి, ద్రౌపదిని చూస్తూ, "పౌత్రీ! ఎందుకమ్మా నవ్వావు?" అని అడిగాడు.

ద్రౌపది ఆ మాటకు ఎంతో సిగ్గుపడిపోయింది. తల దించుకుని, "నన్ను క్షమించండి, పితామహా! ఏదో అజ్ఞానంలో నవ్వేశాను. తప్పు చేశాను, మన్నించండి" అంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Adhyatmika+Kathalu**

* * *